జగిత్యాల: ఓటరు నమోదు పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి నాగిరెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్లతో దృశ్య సమీక్ష నిర్వహించారు. 28 నాటికి ఇంటింటి సర్వే వందశాతం పూర్తి కావాలని ఆధార్ నంబర్ సేకరణ తప్పనిసరి కాదని ఓటర్లు ఇష్టం ఉంటేనే ఇవ్వవచ్చన్నారు. జిల్లా కలెక్టరేట్ నుంచి కలెక్టర్ బి.సత్యప్రసాద్, అదనపు కలెక్టర్లు పి.రాంబాబు, పి.గౌతం రెడ్డి, తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఈనాడు
జగిత్యాల
బుధవారం సెప్టెంబరు 25, 2024 5

విద్యా, వైద్యానికి ప్రాధాన్యం

జిల్లాలో విద్య, వైద్యానికి ప్రాధాన్యతనిస్తున్నాం. జిల్లాలో 783 ప్రభుత్వ పాఠశాలలుండగా మొదటి విడత మన ఊరు-మన బడి కార్యక్రమం కింద 274 పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.115.73 కోట్లు నిధులు కేటాయించగా దాదాపు పనులు పూర్తి కావస్తున్నాయి. అమ్మ ఆదర్శ పాఠశాలల కింద 577 పాఠశాలల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం రూ.32 కోట్లు కేటాయించగా ఇప్పటి వరకు రూ.20 కోట్లు ఖర్చు చేశాం. గురుకుల పాఠశాలలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థి వసతి గృహాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. పెద్దాపూర్ పాఠశాలలో రూ.12 లక్షలతో మరుగుదొడ్లు, విద్యార్థులకు పడక మంచాలు ఏర్పాటు చేశాం. ప్రహరీ తదితర పనులకు మరో రూ.20 లక్షలు వెచ్చిస్తున్నాం. రూ.కోటి ఖర్చుతో అన్ని గురుకులాలు, వసతి గృహాల్లో ఒకటి రెండునెలల్లో పూర్తిస్థాయి మౌలిక సదుపాయాలు కల్పిస్తాం.

420 ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

జిల్లాలో ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు పకడ్బందీ ప్రణాళిక రూపొందించాం. జిల్లా వ్యాప్తంగా 2.30 లక్షల ఎకరాల్లో దొడ్డురకం వరి, 86 వేల ఎకరాల్లో సన్నరకం వరిసాగు చేపట్టారు. 5.70 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డురకం, 1.70 లక్షల మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా. సుమారు 6 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు 420 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నాం. అవసరమైన ఏర్పాట్లు చేయాల్సిందిగా పౌరసరఫరాల అధికారులను ఆదేశించాం. సన్నరకం ధాన్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. అన్ని కొనుగోలు కేంద్రాల్లో సన్న, దొడ్డురకాల ధాన్యం వేర్వేరుగా కొనుగోలు చేస్తాం. సన్నరకం ధాన్యం నిర్ధారించేందుకు అవసరమైన డయల్ మైక్రోమీటర్(గ్రెయిన్ కాలిపర్స్) అన్ని కేంద్రాల్లో అందుబాటులో ఉంచుతాం.

ప్రగతి వేగం పెంచుతాం

'న్యూస్‌టుడే'తో కలెక్టర్ సత్యప్రసాద్



న్యూస్‌టుడే, జగిత్యాల

జిల్లాలో ప్రగతి వేగం పెంచుతామని కలెక్టర్ బి.సత్య ప్రసాద్ చెప్పారు. జిల్లాలోని అన్ని మండలాల్లో పర్యటించి సమస్యలపై అవగాహన చేసుకున్నానని, విద్యా, వైద్య రంగాలకి ప్రాధాన్యతనిస్తూ ప్రజాసమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకొని జిల్లాను అన్ని రంగాల్లో అగ్రభాగాన నిలిపేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టి 100 రోజులు పూర్తయిన సందర్భంగా వివిధ అంశాలపై 'న్యూస్‌టుడే'తో మాట్లాడారు. వివిధ అంశాలపై ఆయన మాటల్లోనే...

మెరుగైన వైద్య సేవలకు కృషి

జిల్లాలో జ్వరాలు ప్రబలుతున్న దృష్ట్యా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ఇప్పటి వరకు 200 వైద్య శిబిరాలు నిర్వహించాం. ఇంటింటి జ్వర సర్వే చేపట్టి జ్వర పరీక్షలు నిర్వహిస్తున్నాం. ఇప్పటి వరకు 14 వేల మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా ఎక్కువగా వైరల్ జ్వరాలే ఉన్నాయి. డెంగీ, చికున్ గన్యా లక్షణాలు లేనప్పటికీ జ్వర పీడితులను కీళ్ల నొప్పులు ఇబ్బంది పెడుతున్నాయి. అన్ని ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన మందులు ఉన్నాయి. వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండేవిధంగా చర్యలు తీసుకున్నాం. ప్రజలు కూడా జ్వరాలపై అవగాహన చేసుకొని జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరిగేలా చూస్తున్నాం. ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. వ్యాధులు ప్రబలుతున్న దృష్ట్యా అన్ని పట్టణాలు, పల్లెల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ

జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాం. జిల్లాలో వరదల వల్ల పెద్దగా నష్టం వాటిల్లలేదు. దెబ్బతిన్న రహదారులు, కల్వర్టులు, చెరువుల మరమ్మతులకు ప్రతిపాదనలు పంపించాం. పాక్షికంగా నష్టపోయిన వారికి సాయమందించాం. ప్రభుత్వం అత్యవసర పనులకు రూ.3 కోట్లు విడుదల చేసింది. జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో 3500 చొప్పున ఇందిరమ్మ ఇళ్లు మంజూరివ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. పూర్తయిన రెండు పడక గదుల ఇళ్లను లబ్ధిదారులకు కేటాయిస్తాం. నూకపల్లి అర్బన్ కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం రూ.32.36 కోట్లు మంజూరిచ్చింది. పనులు జరుగుతున్నాయి. 4250 ఇళ్ల కాలనీలో మిగిలిపోయిన 600 ఇళ్ల కోసం 915 దరఖాస్తులు వచ్చాయి. అర్హులైన వారిని గుర్తిస్తాం. ధరణి సమస్యలను వేగంగా పరిష్కరిస్తున్నాం. కేవలం 750 పెండింగ్‌లో ఉన్నాయి. భూసమస్యల పరిష్కారంలో రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉన్న ఐదు జిల్లాల్లో జగిత్యాల ఉంది.

అర్హులైన లబ్ధిదారులకే పథకాలు

అర్హులైన లబ్ధిదారులకే ప్రభుత్వ పథకాలు అందుతున్నాయి. జిల్లాలో అర్హులైన ప్రతి రైతుకు ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా రుణమాఫీ జరుగుతుంది. 58,852 మంది రైతులకు మూడు విడతల్లో రూ.375.57 కోట్లు రుణమాఫీ జరిగింది. వివిధ సాంకేతిక కారణాలతో కొంత మందికి జరగలేదు, రుణమాఫీ కాలేదని 4150 దరఖాస్తులు వచ్చాయి. కొందరికి బ్యాంకర్ల పొరపాటుతో నిలిచిపోగా మరికొందరికి రూ.2 లక్షలకు మించి రుణం ఉండడం, బ్యాంకు ఖాతాలు, ఆధార్‌కార్డుల్లో పేర్లు వేరుగా ఉండడం తదితర కారణాలతో జరగలేదు. అర్హులైన వారందరికి నెలరోజుల్లో మాఫీ వర్తింపజేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రజాపాలన కింద వచ్చిన దరఖాస్తులన్నింటిని కంప్యూటరీకరించాం. గృహజ్యోతి కింద పేదలకు 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్తు అందిస్తున్నాం. జిల్లాలో ఇప్పటి వరకు 1.93 లక్షల కుటుంబాలకు లబ్ధిచేకూరగా రూ.7.25 కోట్ల బిల్లులను ప్రభుత్వమే భరించింది. మహాలక్ష్మి పథకంలో భాగంగా 2.89 లక్షల కుటుంబాలకు రూ.500లకే వంటగ్యాస్ సిలిండర్ అందుతుంది. ఇప్పటి వరకు 10.86 కోట్ల రాయితీ ప్రభుత్వం ఇచ్చింది. జిల్లాలో ఇప్పటి వరకు ఆర్టీసీ బస్సుల్లో 2.20 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించగా రూ.88.63 కోట్ల లబ్ధి చేకూరింది. అక్టోబర్ 2 నుంచి కొత్త రేషన్‌కార్డులకు దరఖాస్తులు తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి



న్యూస్‌టుడే, జగిత్యాల ధరూర్‌క్యాంపు

జిల్లాలో తీవ్రమైన ఉక్కపోత వాతావరణం నెలకొని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అడపాదడపా వర్షాలు కురుస్తున్నా కురిసినంతసేపే చల్లగా ఉండి ఉక్కపోత ఏమాత్రం తగ్గకపోవటంతో సెప్టెంబరులోనూ ఏసీలు, కూలర్లను వాడాల్సిన విపత్కర పరిస్థితి నెలకొంది.

వాతావరణ మార్పులతో ప్రజల అవస్థలు

ఇటీవల అండమాన్ పరిసర ప్రాంతంలో చక్రవాతపు ఆవర్తనం ఎగువ గాలులతో ఏర్పడి వాయవ్య దిశగా కదలటం వల్ల బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడటం వల్ల ఉత్తర తెలంగాణపైనా ప్రభావం చూపుతోంది. మన ప్రాంతంలోనూ ప్రస్తుతం ఉపరితల ఆవర్తన ద్రోణి కొనసాగుతుండటంతో గరిష్ఠ పగటి ఉష్ణోగ్రతలు 32 డిగ్రీల సెల్సియస్ వరకు, కనిష్ఠ రాత్రి ఉష్ణోగ్రతలు 26 డిగ్రీల సెల్సియస్ వరకు ఉంటున్నా ఉక్కపోత వాతావరణం అలుముకుంది. గాలిలో తేమశాతం అధికంగా ఉండి చల్లటి గాలులు వీయాల్సిన తరుణంలో పొడి గాలులు వీస్తుండటంతో తీవ్రమైన ఉక్కపోత నెలకొంది. మరోవైపు ఉపరితల ఆవర్తన ద్రోణి ఏర్పడిన ప్రాంతం నుంచి ఇతర ప్రాంతాలకు చల్లటి గాలులు తరలిపోగా ద్రోణి కేంద్రీకృతమై ఉన్న ఉత్తర తెలంగాణలో మాత్రం పొడిగాలివల్ల ఉక్కపోత అనూహ్యంగా పెరిగిందని పొలాస ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనస్థానం వాతావరణ శాస్త్రవేత్త బి.శ్రీలక్ష్మి పేర్కొన్నారు.

పెరుగుతున్న వ్యాధులు

చల్లటి వాతావరణం ఉండాల్సిన ప్రస్తుత తరుణంలో ఉష్ణోగ్రతలు పెరగటం, ఉక్కపోత వాతావరణంతో పలు రుగ్మతలు తలెత్తే అవకాశాలున్నాయి. జ్వరాలు, జలుబు, దగ్గు తీవ్రత పెరగటం, దోమలు అధికంగా వృద్ధిచెంది వ్యాధులు అనూహ్యంగా పెరిగాయి. అన్ని ప్రాంతాల్లోనూ జ్వరపీడితుల సంఖ్య గణనీయంగా పెరగగా చిన్నపిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాల్సి ఉంది. అధిక ఉష్ణోగ్రతలు, ఉక్కపోత వాతావరణంతో వరి, పత్తి, కూరగాయలు సహా అన్ని పంటల్లోనూ రసంపీల్చు పురుగుల తీవ్రత చాలా పెరిగింది. తెల్లదోమ, పచ్చదోమ, తామర పురుగులతో పాటు ఉల్లికోడు, అగ్గితెగులు, కాండంతొలుచు పురుగు, ఆకునల్లి తదితరాల వ్యాప్తి ఎక్కువతోంది. రైతులు పంటల్లో మార్పులను అధికారులు లేదా శాస్త్రవేత్తలతో నిర్ధారించుకుని తగిన సవరణ చర్యలను చేపట్టాలని ఏడీఆర్ డాక్టర్ జి.శ్రీనివాస్ సూచించారు.

భయపెడుతున్న బయో మెడికల్ వ్యర్థాలు!

ధర్మపురి పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో బయో మెడికల్ వ్యర్థాలను ఆస్పత్రి ఆవరణలోనే ఉంచుతున్నారు. సిరంజీ బుడ్డీలు, ఇంజక్షన్లు, న్యాప్‌కిన్లు, గాజు సిరప్‌లు తదితర మందులు గత కొన్ని వారాలుగా కవర్లలో మూట కట్టి పురాతన ఆసుపత్రిలోనే ఉంచారు. గుత్తేదారు కనీసం వారానికి ఒకసారి ప్రత్యేక వాహనంలో వీటిని తరలించాలి. కానీ వారాల తరబడి పట్టించుకోకపోవడంతో ఇబ్బందిగా మారింది. ఓ వైపు జ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో ఈ బయో వ్యర్థాలతో ప్రమాదం పొంచి ఉంది. ఈ విషయమై ధర్మపురి సామాజిక ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవిని సంప్రదించగా.. తాను ఇటీవల వచ్చానని.. పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

- న్యూస్‌టుడే, ధర్మపురి



క్రీడా అభివృద్ధికి కృషి



ప్రారంభ కార్యక్రమంలో విప్ లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల క్రీడావిభాగం, న్యూస్‌టుడే: క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. జగిత్యాల పట్టణంలోని శ్రీవివేకానంద మైదానంలో జిల్లా స్థాయి పాఠశాలల క్రీడా పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా హాజరై క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడా వందనం స్వీకరించి అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. మొదటి రోజు జరిగిన పోటీల్లో 17 ఏళ్లలోపు బాలికల విభాగంలో వాలీబాల్ విజేతగా సారంగాపూర్ జట్టు నిలవగా, రెండో స్థానంలో గొల్లపల్లి జట్టు, కబడ్డీలో జగిత్యాల రూరల్, రెండో స్థానంలో ఇబ్రహీంపట్నం, ఖోఖోలో మల్యాల, రెండో స్థానంలో కథలాపూర్ నిలిచింది. శాసనసభ్యుడు ఎం.సంజయ్ కుమార్, పురపాలక అధ్యక్షురాలు అడువాల జ్యోతి, ఉపాధ్యక్షుడు గోలి శ్రీనివాస్, డీఈవో జగన్‌మోహన్ రావు, డీవైఎస్‌వో రవికుమార్, జిల్లా కార్యదర్శి బి.లక్ష్మీరామ్‌నాయక్, పెటా జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్, పీడీలు, పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.



క్రీడా వందనం చేస్తున్న క్రీడాకారులు

ఇన్‌ఛార్జి ఎంఈవోల నియామకం

జగిత్యాల, న్యూస్‌టుడే: జిల్లాలోని ఇరవై మండలాలకు ప్రధానోపాధ్యాయులను ఆయా మండలాల ఇన్‌ఛార్జి ఎంఈవోలుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

మండలం	ప్రధానోపాధ్యాయుడు
మల్యాల	ఎన్.జయసింహరావు
జగిత్యాల రూరల్	బి.గాయత్రి
గొల్లపల్లి	బి.జమునదేవి
కథలాపూర్	ఎల్.శ్రీనివాస్
కోరుట్ల	జి.నారేశం
రాయికల్	ఎస్.రాఘవులు
బీర్‌పూర్	ఎస్.నాగభూషణం
పెగడపల్లి	యం.సులోచనదేవి
కొడిమ్యాల	ఏ.శ్రీనివాస్
జగిత్యాల అర్బన్	వి.భీమయ్య
వెల్గటూరు	బి.ప్రభాకర్
ఇబ్రహీంపట్నం	బి.మధు
మేడిపల్లి	కె.లలిత
బుగ్గారం	ఎస్.వెంకటేశ్వర్లు
సారంగాపూర్	బి.కిషోర్
ఎండపల్లి	జి.రామచంద్రం
బీమారం	వై.మధుసూధన్‌రెడ్డి
ధర్మపురి	వి.శంకరయ్య
మెట్‌పల్లి	యం.చంద్రశేఖర్
మల్లాపూర్	కె.దామోదర్‌రెడ్డి

ఆరోగ్య బీమాతో ధీమాగా..!

- ఉమ్మడి జిల్లాలో 30 శాతం కుటుంబాలకు పాలసీలు
- కరోనా తరవాత పెరిగిన అవగాహన

● గోదావరిఖనికి చెందిన ఏడాది చిన్నారికి తండ్రి వైద్య బీమా చేయించారు. కొద్ది రోజులకే ఆ చిన్నారికి జ్వరం రావడంతో ప్లేట్‌లెట్లు తగ్గాయి. పరిస్థితి తీవ్రంగా ఉండటంతో హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. సమయానికి అందిన వైద్యంతో సురక్షితంగా ఇంటికి చేరుకుంది. చికిత్స ఖర్చు రూ.2 లక్షలు. ఆరోగ్య బీమా ఉండటంతో రూపాయి భారం పడకుండా ఆస్పత్రి బిల్లులు చెల్లించారు.

న్యూస్‌టుడే, గోదావరిఖని

ఇది ఒక ఉదాహరణ మాత్రమే. ప్రస్తుతం ఆరోగ్య బీమాపై అవగాహన పెరగడంతో చాలామంది మధ్య తరగతి, ఎగువ మధ్య తరగతి వారు ఆస్పత్రుల ఖర్చు భారం పడకుండా జాగ్రత్త పడుతున్నారు. కరోనా సమయంలో వైద్య చికిత్సకు రూ.లక్షల్లో బిల్లులు అవడంతో అవగాహన పెరిగి జనం ఆరోగ్య బీమా పాలసీలు తీసుకోవడంపై దృష్టి పెట్టారు. దీంతో ఆ కంపెనీల వ్యాపారం పెరుగుతుండగా.. అనారోగ్య పరిస్థితులు తలెత్తినప్పుడు పాలసీదారులకు ఉపయుక్తంగా మారుతోంది.


● ఉమ్మడి జిల్లాలో 942 ప్రైవేటు ఆస్పత్రులు ఉండగా.. ఇందులో ఇన్ పేషంట్లుగా చేరుతున్న వారిలో 30 శాతం వరకు ఆరోగ్య బీమా పాలసీల ద్వారానే వైద్యం చేయించుకుంటున్నారు. ఇందులో ప్రభుత్వ ఉద్యోగులైతే శాఖాపరంగా వచ్చే బీమా సౌకర్యంతో, ప్రైవేటు ఉద్యోగులు, వివిధ రంగాల వారు తాము చేసుకున్న పాలసీలతో వైద్యం పొందుతున్నారు.

● గతంలో ఆస్పత్రుల్లో చేరితే రూ.లక్షల్లో అప్పు చేయాల్సిన పరిస్థితి ఉండేది. దీంతో మధ్య తరగతి వారు చాలామంది ఆరోగ్య బీమా చేయించుకుని అత్యవసర సమయంలో ఖర్చుల భారం లేకుండా చేసుకుంటున్నారు.

● నిరుపేద కుటుంబాలకు తెల్ల రేషన్ కార్డు ద్వారా ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ వర్తిస్తోంది. ఉమ్మడి జిల్లాలో 30 శాతం మంది వీటి పరిధిలోనే వైద్యం పొందుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసే వారు ఆయా శాఖల ద్వారా ఆరోగ్య బీమా సౌకర్యం పొందుతున్నారు. ఈ కుటుంబాలు లక్ష వరకు ఉంటాయి. ఇక ఏ అవకాశం లేని కుటుంబాల్లో మరో 30 శాతం మంది ప్రైవేటు సంస్థల ద్వారా బీమా చేయించుకుని వైద్య సేవలు పొందుతున్నారు.

● ఉమ్మడి జిల్లాలో రూ.5 లక్షల పరిమితి వరకు పాలసీలు ఎక్కువ మంది తీసుకుంటున్నారు. 3 లక్షల కుటుంబాలకు ప్రైవేటు బీమా పాలసీలు ఉండగా అందులో దాదాపు రెండు లక్షల కుటుంబాలు రూ.5 లక్షల పరిమితి పాలసీ తీసుకున్నాయి.

● ఏదైనా ఆరోగ్య సమస్య తలెత్తితే డబ్బు కోసం ఇతరులపై ఆధారపడకుండా వెంటనే ఆస్పత్రుల్లో చేరేందుకు బీమా సౌకర్యం ఉపయోగపడుతుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



ఉమ్మడి జిల్లా వివరాలు (సుమారు)

జనాభా : 40 లక్షలు

కుటుంబాలు : 10 లక్షలు

ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ పరిధిలోకి వచ్చే కుటుంబాలు : 3 లక్షలు

ప్రైవేటు సంస్థల ఆరోగ్య బీమా తీసుకున్న కుటుంబాలు : 3 లక్షలు

అత్యవసర పరిస్థితుల్లో అండగా..

వైద్య సేవలు పొందేందుకు ఆరోగ్య బీమా చేయించుకోవాలన్న అవగాహన పెరిగింది. ఇటీవల వైద్యం కోసం వస్తున్న వారిలో ఎక్కువ శాతం ఆరోగ్య బీమా కార్డు ద్వారానే సేవలు పొందుతున్నారు. దీని వల్ల అత్యవసర పరిస్థితిలో రోగుల కుటుంబాలకు డబ్బు గురించి హైరానా పడాల్సిన పరిస్థితి తప్పింది. పలు కారణాలతో ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయి. వైద్యానికి భారీ మొత్తంలో ఖర్చు చేయాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో ఆరోగ్య బీమా కొంత ధీమా కల్పిస్తోంది.

- దామెర అనిల్‌కుమార్, ఐఎంఏ రామగుండం అధ్యక్షుడు

వెనుకబడిన విద్యార్థులపై శ్రద్ధ చూపాలి



అంగన్‌వాడీ కేంద్రంలో ఉపాధ్యాయురాలికి సూచనలు చేస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

గొల్లపల్లి, న్యూస్‌టుడే: పదో తరగతి విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశించారు. మంగళవారం గొల్లపల్లిలోని కేజీబీవీని ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలోని తరగతి గదులు, వసతి గృహాన్ని సందర్శించి చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం పరిసరాలను పరిశీలించి పిచ్చిమొక్కలను తొలగించాలన్నారు. నిల్వ ఉన్న డ్రైనేజీ నీరును ఎప్పటికప్పుడు తొలగించాలని నిర్వాహకులను ఆదేశించారు. చిల్వాకోడూర్‌లోని అంగన్వాడీ కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ఆరు సంవత్సరాలలోపు పిల్లలు ఎంతమంది ఉన్నారో ఆరా తీసి.. రోజూ హాజరవుతున్నారా లేదా? అని తెలుసుకున్నారు. మెనూ ప్రకారం పోషక పదార్థాలు అందిస్తున్నారా.. చిన్నారులు వయసుకు తగ్గ బరువు, ఎత్తు ఉన్నారా అని పరిశీలించారు. మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని నిర్వాహకులకు సూచించారు. మండల ప్రత్యేక అధికారి సాయిబాబా, తహసీల్దార్ జమీర్, ఎంపీడీవో రాంరెడ్డి, ఎస్‌వో పద్మ, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి

జగిత్యాల: అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ ఆదేశించారు. మంగళవారం నూకపల్లి అర్బన్‌కాలనీలో రెండు పడక గదుల ఇళ్లను పరిశీలించారు. మురుగుకాలువలు, విద్యుత్తు, మంచినీటి సరఫరా కోసం ప్రభుత్వం రూ.32.36 కోట్లు మంజూరిచ్చిందని వాటితో అవసరమైన పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. 20 రోజుల్లో పనులు పూర్తయ్యేలా చూడాలని కలెక్టర్ అన్నారు. పంచాయతీరాజ్, మిషన్‌భగీరథ ఈఈలు రహమాన్, శేఖర్‌రెడ్డి, డిప్యూటీ ఈఈ రాజేశ్వర్, తహసీల్దార్ రాంమోహన్, కమిషనర్ సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

నిరంతరం పర్యవేక్షించాలి.. అంగన్‌వాడీ కేంద్రాలను నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ బి.సత్యప్రసాద్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ స్త్రీ, శిశు సంక్షేమ అధికారులతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సూపర్‌వైజర్లు క్షేత్రస్థాయిలో సందర్శించి అంగన్‌వాడీ కేంద్రాల్లో మెరుగైన సేవలందేలా చూడాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం చూపవద్దని పేర్కొన్నారు. జిల్లా సంక్షేమాధికారి డాక్టర్ బి.నరేష్, సీడీపీవోలు, ఐసీపీఎస్, సఖి సిబ్బంది పాల్గొన్నారు.

ఫుల్‌వాగులో ఇసుక తవ్వకాలు

● జరిమానా విధించినా మారని తీరు

కోరుట్ల, న్యూస్‌టుడే: కోరుట్ల పట్టణంలోని ఫుల్‌వాగులో అక్రమ ఇసుక తవ్వకాలు మరోమారు ప్రారంభమయ్యాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వాగులో వరద నీటికి ఇసుక కుప్పలు ఏర్పడ్డాయి. నీటి ప్రవాహం తగ్గిన తర్వాత అక్రమ ఇసుక వ్యాపారులు తవ్వకాలను జోరుగా చేపడుతున్నారు. గత నెలలో మండలంలోని నాగులపేట, పైడిమడుగు, కోరుట్ల వాగులోంచి అక్రమంగా ఇసుకను తవ్వి తరలిస్తున్న 34 ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు పట్టుకొని సీజ్ చేశారు. పట్టుకున్న అక్రమ ఇసుక ట్రాక్టర్లను నెల రోజుల పాటు రెవెన్యూ, మండల పరిషత్ కార్యాలయాల పరిసరాల్లో ఉంచారు. ఇటీవల ఒక్కో ట్రాక్టర్‌కు రూ.25వేల చొప్పున రెవెన్యూ అధికారులు జరిమానా విధించి విడిచి పెట్టారు. మరోమారు అక్రమ ఇసుక రవాణా చేస్తే ట్రాక్టర్ సీజ్ చేయడంతోపాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని రెవెన్యూ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఇసుక అవసరమున్న వారు ముందస్తుగా డీడీలు చెల్లించి ప్రభుత్వం నిర్దేశించిన ఇసుక రీచ్‌లోంచి మాత్రమే తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఇసుక రవాణా చేసేందుకు రవాణాశాఖ నుంచి వ్యవసాయ పనులకు అనుమతులు తీసుకున్న ట్రాక్టర్లను వినియోగించ వద్దని, కేవలం కమర్షియల్ కోసం అనుమతులు పొందిన ట్రాక్టర్లను మాత్రమే వినియోగించాలని నిర్దేశించారు. కానీ ఇవేమి లెక్క చేయని వ్యాపారులు అందరు చూస్తుండగానే రాత్రిపూట తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అడ్డుకట్ట వేయకుంటే వాగులో నీటి ప్రవాహం పూర్తిగా తగ్గిన తర్వాత మొత్తం తరలించే అవకాశం ఉంది.



కోరుట్ల ఫుల్‌వాగు



వాగులో ట్రాక్టర్‌తో ఇసుకను కుప్పగా నేర్పుతున్న దృశ్యం

సంకేత భాషపై పట్టుసాధించాలి

జగిత్యాల, న్యూస్‌టుడే: సంకేత భాషపై దివ్యాంగులు పట్టుసాధించాలని జిల్లా వైద్యాధికారి ఎం.డి.సమియొద్దీన్ అన్నారు. అంతర్జాతీయ సంకేత భాష వారోత్సవాల సందర్భంగా మైనార్టీ గురుకుల పాఠశాలలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ పద్మ చెవి, ముక్కు, గొంతు వ్యాధులపై అవగాహన కల్పించారు. ప్రోగ్రాం అధికారి డాక్టర్ అర్చన, ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ సంతోష్, పాఠశాల కోఆర్డినేటర్ శ్రీధర్, ఆరోగ్య పర్యవేక్షకుడు మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

పట్టు పెరుగుతోంది

● ఉమ్మడి జిల్లాలో మల్బరీ సాగుపై రైతుల ఆసక్తి

న్యూస్‌టుడే, జగిత్యాల వ్యవసాయం

ఉమ్మడి జిల్లాలో సాగు అనుబంధంగా పట్టుపురుగుల పెంపకం ఏటికేడు విస్తరిస్తోంది. రైతులకు ప్రత్యామ్నాయ ఆదాయ వనరుగా మల్బరీసాగు నాలుగు జిల్లాల్లో దాదాపుగా 279 ఎకరాలకు విస్తరించగా మరో 90 మంది వరకు నూతనంగా పట్టు పురుగుల పెంపకానికి దరఖాస్తు చేయటం సాగు సానుకూలతను వెల్లడిస్తోంది.


మల్బరీ మొక్కల పెంపకం

రాయితీలు

సిల్క్ సమగ్ర పథకం ద్వారా మల్బరీ మొక్కలు, పట్టుపురుగుల పెంపకానికి పలు రాయితీలు ఇస్తున్నారు. సాధారణ రైతులకు 2 ఎకరాల్లో సాగుకు 60 వేలు ఇస్తుండగా ఎస్సీ, ఎస్టీ రైతులకు రూ. 78 వేలు ఇస్తున్నారు. పట్టుపురుగులను పెంచే షెడ్డు నిర్మాణానికి రూ.5-6.5 లక్షలు ఖర్చవుతుండగా జనరల్ రైతులకు రూ.2.25 లక్షలు, ఎస్సీ, ఎస్టీ రైతులకు రూ.2.95 లక్షలను రాయితీగా ఇస్తున్నారు. షెడ్డులో అమర్చే ఒక్కో స్టాండ్స్‌కు రూ.17 వేలు, నేత్రికలు, ట్రేలు, ఇతర సామగ్రికి రూ.4 వేలు, రోగ నిరోధక మందులకు రూ.2,500 నుంచి రూ.3,250 చొప్పున నిధులను ఇస్తున్నారు. గతంలో పట్టుగూళ్లకు కిలోకు రూ.75 చొప్పున రైతులకు ఇచ్చిన ఇన్సెంటివ్ మొత్తాన్ని పెంచి కొనసాగించాల్సి ఉంది. ఉద్యానశాఖద్వారా, పొలాసలోని వ్యవసాయ కళాశాలలోనూ పట్టుపురుగుల పెంపకంపై రైతులకు శిక్షణ ఇస్తున్నారు.




పట్టుపురుగులు

దిగుబడి

మల్బరీ మొక్కలను ఒకసారి నాటితే నిరంతరం కాపు వస్తుంది. చీడపీడల బెడద ఉండదు. పట్టుసాగును చేపట్టిన తొలిసారే షెడ్డు, చంద్రికలు, తడకలు, నెట్లు తదితరాలకు పెట్టుబడి ఉంటుంది. తరువాతి పంటలకు కేవలం గుడ్లను కొనటం, మందు ద్రావణం, కూలీల ఖర్చు తదితర చిన్నచిన్న పెట్టుబడులు మాత్రమే ఉంటాయి. మల్బరీ ఇది వరకు సాగుచేస్తున్నవారు ఏడాదిలో సరాసరిగా 6-8 పంటలవరకు కాపు తీసుకున్నారు. 100 గుడ్లకు 80 కిలోల వరకు పట్టుగూళ్లు వస్తుండగా కిలోకు కుకూన్ ధర రూ.550-670 వరకుంది. హైదరాబాద్, జనగాంలో పట్టుగూళ్ల విక్రయ మార్కెట్లున్నాయి. 25-35 రోజులకొక పంట పూర్తవుతుండగా ఖర్చులుపోనూ ఎకరాకు కనీసం రూ.80 వేల నుంచి రూ.1.30 లక్షల వరకు ఆదాయం వస్తోంది. పట్టు పురుగులపై ఆశించే తెగుళ్లను సమర్థంగా నిరోధించటం, పట్టుగూళ్లు అల్లుకునే దశల్లో ఇంటిల్లిపాది శ్రమించటంవల్ల రైతులు సత్ఫలితాలను సాధిస్తున్నట్లు ఉద్యానశాఖ అధికారి శ్యామ్‌ప్రసాద్ తెలిపారు.

ఏడాది పొడవునా ఆదాయం



పట్టుపురుగుల పెంపకంతో ఏడాది పొడవునా నికరాదాయం పొందవచ్చు. పట్టుపురుగులపై వచ్చే తెగుళ్లపట్ల అప్రమత్తంగా ఉంటే ఎకరా విస్తీర్ణంలోని పంటకు కనీసం 1.20 క్వింటాళ్లకుపైగా పట్టుగూళ్లు వస్తాయి. ప్రభుత్వం పట్టుగూళ్లకు ఇన్సెంటివ్‌ను పెంచి ఇచ్చినట్లయితే మరింత ప్రోత్సాహకంగా ఉంటుంది.

- నేరెళ్ల చంద్రమౌళి, రైతు, కల్లెడ, జగిత్యాల మండలం

ప్రతిభకు వేదిక.. బాలల వేడుక

ఈ నెలాఖరులో కళోత్సవ్

న్యూస్‌టుడే, కరీంనగర్ విద్యావిభాగం

ఉమ్మడి జిల్లాలోని విద్యార్థుల పాఠ్యేతర అంశాలపై ఆసక్తి చూపుతున్నారు. పాఠశాలల్లో జరిగే ప్రత్యేక దినోత్సవాల కార్యక్రమాల్లో వివిధ కళల్లో తమదైన ప్రతిభను చాటుకుంటున్నారు. ఇలాంటి వారిని ఒక వేదికపైకి తీసుకొచ్చి వారిలోని ప్రతిభను వెలుగులోకి తెచ్చి ప్రోత్సహించేందుకు రాష్ట్ర విద్యాశాఖ కళోత్సవ్ పేరుతో పోటీలను నిర్వహిస్తోంది. ఎస్‌సీఈఆర్టీ వారు రాష్ట్ర సమగ్ర శిక్ష అభియాన్‌తో కలిసి ఏటా సంప్రదాయ కళాంశాల్లో విద్యార్థుల ప్రదర్శనలకు ఇది వేదికగా నిలిచేలా మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పోటీలను నిర్వహిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో జిల్లా, మండల స్థాయిలో విద్యార్థి

జిల్లా	పాఠశాలలు	విద్యార్థులు
కరీంనగర్	929	1,12,829
జగిత్యాల	1,069	1,23,315
పెద్దపల్లి	712	80,282
సిరిసిల్ల	602	61,579


గత కళోత్సవ్‌లో విద్యార్థి నృత్యం

ఆరు అంశాల్లో పోటీలు

గతంలో పది కళాంశాల్లో పోటీలు నిర్వహించగా, ఈ విద్యా సంవత్సరంలో ఆరు అంశాల్లో నిర్వహిస్తున్నారు. వోకల్ మ్యూజిక్, ఇన్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్, నృత్యం, థియేటర్, విజువల్ ఆర్ట్స్, సంప్రదాయ కథలు చెప్పడం వంటి అంశాల్లో పోటీలు జరుగనున్నాయి. ఉమ్మడి జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలు, కళాశాలల్లో 9వ తరగతి నుంచి ఇంటర్ చదువుతున్న విద్యార్థులు ఈ పోటీలకు అర్హులు. మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రతిభను చాటి జాతీయ స్థాయికి ఎంపికై విజేతలుగా నిలిచిన వారికి నగదుతోపాటు ప్రశంసాపత్రాలను అందిస్తున్నారు. పోటీల్లో ప్రతి విద్యాసంస్థ నుంచి ఒక్కో విభాగంలో ఒక బాలుడు, ఒక బాలికను అనుమతిస్తారు. పోటీలకు సంబంధించిన వివరాల కోసం ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయా జిల్లాలోని సమగ్ర శిక్షా అధికారులను సంప్రదించి పూర్తి సమాచారాన్ని పొందే వీలుంది.

లకు ఈ నెలాఖరులో పోటీలను నిర్వహించనున్నారు. మూడేళ్లుగా నిర్వహిస్తున్న ఈ పోటీల్లో విద్యార్థులు రాష్ట్రస్థాయిలో పలు ప్రదర్శనల్లో బహుమతులు సాధించారు.

ప్రోత్సహిస్తే ప్రయోజనం

కళల పట్ల విద్యార్థులు ఆసక్తి చూపడంలో ముందు వరుసలో నిలుస్తున్నారు. టీవీలు, సామాజిక మాధ్యమాల ప్రభావంతో వారికి ఇష్టమైన అంశంలో ప్రావీణ్యం పెంచుకుంటున్నారు. తల్లిదండ్రులు పలు అంశాల్లో బాలలకు ప్రత్యేకంగా శిక్షణ ఇప్పిస్తున్నారు. పాఠశాలల్లో జరిగే పలు కార్యక్రమాల్లో విద్యార్థులు పలు అంశాల్లో రాణిస్తూ అందరిని అలరిస్తున్నారు. ఇప్పుడు కళోత్సవ్‌లో పాల్గొనేందుకు వారికి ఆసక్తి ఉన్నా వారిని ప్రోత్సహించి వారి ప్రతిభకు మరింత మెరుగులు దిద్దే చర్యలు ఉపాధ్యాయులు చేపడితే వారు మరింత రాణించే అవకాశముంది.

విద్యార్థులు పాల్గొనేలా చర్యలు

- కె.అశోక్‌రెడ్డి, సెక్టోరల్ అధికారి, కరీంనగర్

వివిధ కళల్లో ఆసక్తి గల విద్యార్థులకు కళోత్సవ్ మంచి అవకాశం. ఉపాధ్యాయులు ఆసక్తి గల విద్యార్థులను ఈవైపు ప్రోత్సహించాలి. ఈ నెలాఖరులో పోటీలు ఉంటాయి.

18 తులాల బంగారు ఆభరణాలు మాయం

కరీంనగర్ నేరవార్తలు, న్యూస్‌టుడే: ఇంట్లోని రూ.3.50 లక్షలు అలాగే ఉన్నా.. 18 తులాల బంగారు ఆభరణాలు మాత్రం అపహరణకు గురైన ఘటన మిస్టరీగా మారింది. కరీంనగర్ రెండో ఠాణా పోలీసుల కథనం ప్రకారం.. నగరంలోని ప్రగతినగర్‌లో నివాసం ఉంటున్న పిట్టల ప్రశాంత్ గ్రానైట్ క్వారీ వ్యాపారం చేస్తున్నారు. అతడు మంగళవారం క్వారీ వద్దకు వెళ్లగా ఆయన భార్య లహరి మధ్యాహ్నం ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లింది. ఇంటికి వచ్చి తాళం తీసి లోనికి వెళ్లగా మరోవైపు ఉన్న తలుపులు తెరచి ఉన్నాయి. అనుమానంతో బీరువాలో చూడగా 18 తులాల బంగారు ఆభరణాలు కనిపించలేదు. బీరువాలో మరోవైపున్న రూ.3.50 లక్షల నగదు భద్రంగానే ఉంది. ఈ మేరకు సమాచారం అందుకున్న నగర ఏసీపీ నరేందర్, రెండో ఠాణా సీఐ విజయ్‌కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు.


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

జాతీయ స్థాయి ట్రెక్కింగ్ పోటీలకు బడితండా వాసి ఎంపిక

రుద్రంగి, న్యూస్‌టుడే: హిమాచల్‌ప్రదేశ్‌లో అక్టోబర్ 22న నిర్వహించే జాతీయ స్థాయి ట్రెక్కింగ్ పోటీలకు రుద్రంగి మండలం బడితండా గ్రామానికి చెందిన విద్యార్థి మాలోత్ అనిల్ ఎంపికయ్యారు. అనిల్ ప్రస్తుతం కరీంనగర్‌లోని ఎస్ఆర్ఆర్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో బీకాం రెండో సంవత్సరం చదువుతున్నారు. ఇటీవల శాతవాహన విశ్వవిద్యాలయంలో నిర్వహించిన ట్రెక్కింగ్ పోటీల్లో అత్యున్నత ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. దీంతో కళాశాల అధ్యాపక బృందంతోపాటు బడితండా వాసులు అతనిని అభినందించారు.


అనిల్‌ను అభినందిస్తున్న అధ్యాపక బృందం

పేరుకే కమిటీలు.. పరిష్కారం కాని సమస్యలు

న్యూస్‌టుడే, హుజూరాబాద్

పట్టణాభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని ఉమ్మడి జిల్లాలోని పురపాలికలు, నగరపాలికల్లో ఏర్పాటుచేసిన వార్డు కమిటీలు ఉత్సవ విగ్రహాలుగా మిగిలాయి. అభివృద్ధి పనుల్లో పాలకవర్గం, అధికార యంత్రాంగంతోపాటు ప్రజలను భాగస్వాములను చేసే లక్ష్యంతో 2020 ఏప్రిల్‌లో గత ప్రభుత్వం వీటిని ఏర్పాటు చేసింది. నాలుగేళ్లు దాటినా ఈ కమిటీల సలహాలు, సూచనలు తీసుకోకుండా నిర్వీర్యం చేశారు. ఫలితంగా అభివృద్ధి పనుల్లో వీరి భాగస్వామ్యం పూర్తిగా కొరవడింది.


హుజూరాబాద్‌లోని పురపాలిక సంఘ కార్యాలయం

పురపాలికల్లో వీటి భాగస్వామ్యం శూన్యం

401 వార్డులు.. 1844 కమిటీలు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న 14 పురపాలికలతోపాటు.. కరీంనగర్, రామగుండం నగరపాలికల్లోని 401 వార్డుల్లో 1844 కమిటీలను ఏర్పాటుచేశారు. ఇందులో 27,660 మంది సభ్యులున్నారు. ఒక్కో వార్డుకు నాలుగు కమిటీల చొప్పున ఒక్కో కమిటీలో 15 మంది సభ్యులతో.. యువకులు, విశ్రాంత ఉద్యోగులు, మహిళలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలిపి వీటిని ఏర్పాటు చేశారు.

సమావేశాల ఊసే లేదు..

ప్రతి వార్డుకు కమిటీలను నియమించి సభ్యులకు లక్ష్యాలు నిర్దేశించారు. అయితే ఏర్పాటు సమయంలో చూపిన ఆసక్తి.. ఆ తర్వాత పూర్తిగా కొరవడింది. వార్డు కమిటీ సభ్యులతో రెండు, మూడు నెలలకో సారి ప్రత్యేక సమావేశాలు నిర్వహించి.. చేపట్టాల్సిన పనులు, సమస్యలపై చర్చించాలి. అనంతరం అందరి ఆమోదంతో ఏకగ్రీవంగా పనులను ఎంపిక చేసి వార్డు అధికారి ద్వారా పురపాలక కమిషనర్ దృష్టికి తీసుకెళ్లాలి. కమిషనర్ పాలకవర్గం దృష్టికి తీసుకెళ్లి ఆయా సమస్యలను పరిష్కరించేలా కృషి చేయాల్సి ఉంది. అయితే ఒక్కసారి కూడా కమిటీ సభ్యులతో సమావేశాలు నిర్వహించడం, అభివృద్ధి పనుల ప్రణాళికలు రూపొందించిన దాఖలాలు లేవు. ఫలితంగా సమస్యలు వెంటాడుతున్నాయి.

ఉమ్మడి జిల్లాకు సంబంధించిన వివరాలు..

జిల్లా	పురపాలికలు	వార్డులు	కమిటీలు	సభ్యులు
కరీంనగర్	4	146	584	8,760
జగిత్యాల	5	134	536	8,040
పెద్దపల్లి	3	114	456	6,840
సిరిసిల్ల	2	67	268	4,020


హుజూరాబాద్‌లోని పద్మానగర్‌లో బురద రోడ్డుతో అవస్థలు

ఈ ప్రభుత్వం అయినా పట్టించుకునేనా?

ఆయా వార్డుల్లో వనమహోత్సవం, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, అక్రమ నిర్మాణాల గుర్తింపు తదితర అంశాలపై పాలకవర్గం, అధికార యంత్రాంగం ఈ కమిటీ సభ్యుల సలహాలు, సూచనలు తీసుకొని ఆయా పనులను చేపట్టాల్సి ఉంటుంది. కానీ నాలుగేళ్లుగా ఈ కమిటీల అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోకుండా నిర్వీర్యం చేశారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యాకనైనా వీటికి ప్రాధాన్యత ఇస్తుందని ఆశించినా.. ఆ దిశగా చర్యలు మాత్రం చేపట్టలేదు. అసలు వార్డు కమిటీలు ఉన్నాయనే విషయం కూడా చాలా మందికి తెలియదంటే వీటి ప్రాధాన్యత ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

రాజన్న హుండీ ఆదాయం రూ.1.44 కోట్లు

వేములవాడ, న్యూస్‌టుడే: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయ హుండీని అధికారులు మంగళవారం లెక్కించారు. 12 రోజులకు రూ.1,44,06,154 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి తెలిపారు. బంగారం 710 గ్రాములు, వెండి 14 కిలోలను భక్తులు కానుకల రూపంలో స్వామివారికి సమర్పించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ కరీంనగర్ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయం పరిశీలకుడు సత్యనారాయణ, ఆలయ అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థ మహిళలు పాల్గొన్నారు.


కానుకలు లెక్కిస్తున్న ఉద్యోగులు తదితరులు

శ్రీరామసాగర్‌కు పెరిగిన వరద

జగిత్యాల ధరూర్ క్యాంపు, న్యూస్‌టుడే: గోదావరి నదీ పరీవాహక ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో శ్రీరామసాగర్ ప్రాజెక్టులోకి వరద మంగళవారం సాయంత్రం వరకు 45,858 క్యూసెక్కులకు పెరిగింది. ప్రాజెక్టు నుంచి వరదకాలువకు నీటివిడుదలను 15 వేల క్యూసెక్కులకు పెంచి మధ్యమానేరు జలాశయానికి తరలించనున్నారు. ఇన్‌ఫ్లో పెరగటంతో 7 గేట్లను తెరచి 21,868 క్యూసెక్కుల మిగులు జలాలను గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులో గరిష్ఠస్థాయిలో నీటినిల్వ 80.501 టీఎంసీలుగా, నీటిమట్టం 1091 అడుగులుగా ఉంది. ప్రాజెక్టునుంచి గోదావరి నదిలోకి, వరదకాలువకు నీటిని విడుదల చేస్తున్నందున మత్స్యకారులు, పశువుల కాపరులు జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు.


వరద కాలువలో నీరు

ఓ మోస్తరు నుంచి భారీ వర్షసూచన

ఉమ్మడి జిల్లాలో రాగల అయిదు రోజుల్లో అక్కడక్కడ ఓ మోస్తరు నుంచి భారీ వర్ష సూచన ఉందని జగిత్యాల పరిశోధనస్థానం సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ జి.శ్రీనివాస్ తెలిపారు. ఉరుములు, మెరుపులు, బలమైన గాలులతోకూడిన వర్షసూచన ఉందన్నారు. 22-24 డిగ్రీల కనిష్ఠ, 33-34 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రతలు నెలకొంటాయని సూచించారు.

మధ్యమానేరుకు 8,200 క్యూసెక్కులు

బోయినపల్లి: రాజరాజేశ్వర జలాశయానికి వరద కొనసాగుతుంది. ఎస్సారెస్పీ నుంచి వరద కాలువ ద్వారా 6 వేలు, మానేరు, మూలవాగుల నుంచి 2200 క్యూసెక్కులు వచ్చి చేరుతుంది. జలాశయం పూర్తి సామర్థ్యం 27.5 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 24.33 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వస్తున్న ఇన్‌ఫ్లో ఆధారంగా నీటి విడుదల ఉంటుందని అధికారులు తెలిపారు. జలాశయం దిగువన మానేరు వాగులో రైతులు తమ మోటార్లు తొలగించాలని సూచించారు.

బ్యాంకు ఖాతాల నుంచి రూ.20 లక్షలు మాయం

● కేసును ఛేదించిన కరీంనగర్ సైబర్ క్రైం పోలీసులు

కరీంనగర్ నేరవార్తలు, న్యూస్‌టుడే: నమ్మకంగా మెదిలి బ్యాంకు ఖాతాల నుంచి రూ.20 లక్షలు కాజేసిన ఘటన ఇది. రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో కథనం ప్రకారం.. కరీంనగర్‌లోని నీటిపారుదల శాఖలో ఎం.డి.సమీయుద్దీన్ పర్యవేక్షణాధికారిగా పని చేసి 2013లో ఉద్యోగ విరమణ పొందారు. అతడు అవివాహితుడు. సమీయుద్దీన్ ఇద్దరు చెల్లెళ్లకూ వివాహం కాలేదు. ఉద్యోగ విరమణ చేసిన తరువాత వచ్చిన కొంతడబ్బును ఓ బ్యాంకు ఖాతాలో, మరికొంత నగదును తన సోదరి సబీహా సుల్తానా బ్యాంకు ఖాతాలో జమ చేశారు. సమీయుద్దీన్ పని చేస్తున్న నీటిపారుదల శాఖలోనే జహంగీర్ జూనియర్ అసిస్టెంట్‌గా పని చేసేవారు. ఈ క్రమంలో జహంగీర్, సమీయుద్దీన్ కుటుంబాల మధ్య పరిచయం ఏర్పడింది. సమీయుద్దీన్ 2022లో మృతి చెందారు. అతడి బ్యాంకు ఖాతా, తన సోదరి సబీహా సుల్తానా బ్యాంకు ఖాతాల వివరాలు జహంగీర్ తెలుసుకున్నాడు. మూడు నెలల కింద కరీంనగర్‌లో జిమ్ నిర్వాహకుడైన మహ్మద్ ఆసిఫ్ పాషాకు విషయం తెలిపి అతడితో చేతులు కలిపాడు. సమీయుద్దీన్ వినియోగించిన చరవాణి నంబర్‌ను ఆసిఫ్ పాషా రద్దు చేయించి తన పేరు మీదకు మార్చుకున్నాడు. సాంకేతిక పరిజ్ఞానంతో సమీయుద్దీన్, సబీహా సుల్తానా బ్యాంకు ఖాతాల్లో ఎంత నగదు ఉందో తెలుసుకున్నారు. సబీహా సుల్తానా బ్యాంక్ ఖాతాలో నిల్వ ఉన్న రూ.20,18,557 నగదు ఉన్నట్లు గుర్తించారు. అవసరాల మేరకు యూపీఐ ద్వారా విడుతల వారీగా రూ.20 లక్షల మేర మళ్లించుకున్నారు. నెల కింద సబీహా సుల్తానా బ్యాంకు వెళ్లి రూ.లక్ష డ్రా చేసుకున్నారు. మిగతా నిల్వ ఉన్న నగదుపై విచారించగా ఖాతాలో కేవలం రూ.4 లక్షలు ఉన్నట్లు తెలిసింది. దీంతో ఆమె కరీంనగర్ సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయగా ఏసీపీ నరసింహారెడ్డి కేసు దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి కేసును ఛేదించారు. నేరంలో కీలకపాత్ర పోషించిన ఆసిఫ్ పాషాను అరెస్టు చేసి అతడి వద్ద నుంచి రూ.18 లక్షల నగదును రికవరీ చేశారు. జహంగీర్ పరారీలో ఉన్నట్లు ఏసీపీ తెలిపారు.

రామగుండం ఠాణాలకు రాష్ట్ర స్థాయి గుర్తింపు

గోదావరిఖని, న్యూస్‌టుడే: రాష్ట్రవ్యాప్తంగా ఠాణాల్లో సేవలు, ఫిర్యాదుదారులతో వ్యవహరించే తీరుపై రామగుండం పోలీసు కమిషనరేట్ పరిధిలోని మూడు ఠాణాలకు గుర్తింపు దక్కింది. ఖని వన్‌టౌన్ స్టేషన్‌లో రిసెప్షన్ కేంద్రంలో పనిచేసే కానిస్టేబుల్ వెంకటలక్ష్మి బాధితులతో మర్యాదగా వ్యవహరించి.. సమస్య తెలుసుకొని ఠాణా అధికారి దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగే విధంగా భరోసా కల్పించడంలో ప్రత్యేకత చాటుకున్నారు. దీనికి ఫిర్యాదుల నిర్వహణలో రాష్ట్ర వ్యాప్తంగా అయిదు ఉత్తమంగా ఉన్నవి ఎంపిక చేయగా.. గోదావరిఖని ఒకటో పట్టణ పోలీసుస్టేషన్ నాలుగో స్థానంలో నిలిచింది. సమస్యలతో వచ్చే బాధితులకు వెంటనే స్పందించి సేవలందించే విధంగా బాధ్యతలు నిర్వహించిన మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ఒకటో పట్టణ సీఐ దేవయ్య, ధర్మారం ఠాణా ఎస్.ఐ లక్ష్మణ్‌లకు గుర్తింపు దక్కింది. దీంతో సత్వర సేవల విభాగంలో పదింటిలో బెల్లంపల్లి వన్‌టౌన్, ధర్మారం పోలీసుస్టేషన్‌లు వరుసగా మూడు, అయిదు స్థానాలు పొందాయి. ఆన్‌లైన్ ఫీడ్‌బ్యాక్ ద్వారా సేకరించిన సమాచారం మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఈ స్థానాలను కేటాయించారు.


వెంకటలక్ష్మి లక్ష్మణ్

నవోదయ విద్యాలయ ప్రవేశానికి గడువు పొడిగింపు

చొప్పదండి, న్యూస్‌టుడే: నవోదయ పాఠశాలలో 2025-26 సంవత్సరానికిగాను ఆరో తరగతి ప్రవేశ గడువు వచ్చే నెల 7 వరకు పొడిగించినట్లు ప్రిన్సిపల్ మంగతాయారు ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశాక పొరపాట్లు సరిదిద్దుకోవడానికి అక్టోబరు 8 నుంచి 9 వరకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

పీజీ ఫలితాలు విడుదల

కరీంనగర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో జులై, ఆగస్టులో నిర్వహించిన పీజీ ఫలితాలు విడుదల చేసినట్లు ఎస్‌యూ పరీక్షల నియంత్రణాధికారి డా.శ్రీరంగప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ (ఆంగ్లం, ఉర్దూ, తెలుగు, ఎకనామిక్స్, సోషియాలజీ, ఎంఎస్‌డబ్ల్యూ), ఎమ్మెస్సీ (బాటనీ, జంతుశాస్త్రం, స్టాటిస్టిక్స్, న్యూట్రిషన్), ఎంసీఏ నాలుగు, రెండో సెమిస్టర్ పరీక్ష ఫలితాలు www.satavahana.ac.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు.

ప్రైవేటు ఉపాధ్యాయులకు సౌకర్యాలు కల్పించండి

కరీంనగర్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఎలాంటి ఆధారం లేని పలువురు పట్టభద్రులకు ప్రైవేటు పాఠశాలలు ఉపాధి కల్పిస్తున్నాయని తెలంగాణ ప్రభుత్వామోదిత పాఠశాలల యాజమాన్యాల సంఘం (ట్రస్మా) రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు వై.శేఖర్‌రావు తెలిపారు. కరీంనగర్‌లో మంగళవారం ఉమ్మడి జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల పలువురి ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించి మాట్లాడారు. ప్రైవేటు ఉపాధ్యాయులకు ఆరోగ్యకార్డులు, రూ.10 లక్షల ఆరోగ్య బీమా, పెన్షన్ వంటి సౌకర్యాలు కల్పించాలని.. ప్రైవేటు పాఠశాలల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆలిండియా ప్రిన్సిపల్స్, లీడర్స్ అసోసియేషన్ ఫౌండర్, సెక్రటరీ డాక్టర్ ఎ.జోష్ణరావు, ట్రస్మా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.యాదగిరి, పలు జిల్లాల అధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్, ఎం.తిరుపతిరెడ్డి, కె.కేశవరెడ్డి, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.



ఉత్తమ ఉపాధ్యాయినిగా సర్టిఫికెట్ అందిస్తున్న ట్రస్మా నాయకులు

ట్రాన్స్‌జెండర్లకు ఉపాధి హామీ

కోరిన వారికి జాబ్ కార్డు మంజూరు చేయాలని కేంద్రం ఆదేశాలు

న్యూస్‌టుడే, పెద్దపల్లి కలెక్టరేట్:

ట్రాన్స్‌జెండర్లు గౌరవప్రదంగా జీవించడానికి ప్రభుత్వాలు చర్యలు తీసుకొంటున్నాయి. వారిని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లో ట్రాఫిక్ వాలంటీర్లుగా నియమిస్తామని ప్రకటించగా.. ప్రస్తుతం కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఉపాధిహామీ పని కల్పించాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఎలాంటి వివక్ష లేకుండా ప్రతి ఒక ట్రాన్స్‌జెండర్‌కు జాబ్ కార్డు మంజూరు చేయాలని పేర్కొంది. దీనికి సంబంధించి మార్గదర్శకాలు విడుదల చేసింది. దీంతో పల్లెల్లో ట్రాన్స్‌జెండర్ల గుర్తింపులో అధికారులు నిమగ్నమయ్యారు. మరోవైపు ఎస్సీ, ఎస్టీ వర్గాల కూలీల్లో ఇప్పటివరకు వ్యక్తిగతంగా లబ్ధిపొందిన వారి వివరాలను సేకరించి ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేస్తున్నారు.

మార్గదర్శకాల్లో ముఖ్యాంశాలు

- ✦ ట్రాన్స్‌జెండర్లకు ఆధార్ ఆధారంగా జాబ్‌కార్డు ఇవ్వాలి.
- ✦ ఒక గ్రామంలో ఇద్దరి కంటే ఎక్కువ మంది ఉంటే గ్రూప్‌గా ఏర్పాటు చేయాలి.
- ✦ గ్రూప్ లేక వ్యక్తిగతంగా ఒకే ప్రాంతంలో పని కల్పించాలి.
- ✦ పని ప్రదేశంలో వారి పట్ల ఎలాంటి వివక్ష చూపరాదు. దీని కోసం మేట్లకు అవగాహన సదస్సులు నిర్వహించాలి.
- ✦ ట్రాన్స్‌జెండర్ల సమస్యల కోసం మండల, జిల్లా స్థాయిల్లో నోడల్ అధికారిని నియమించాలి.

178కి లబ్ధి

ఉమ్మడి జిల్లాలో ట్రాన్స్‌జెండర్లకు ఉపాధిపై భరోసా కలగనుంది. ఓటరు జాబితా ప్రకారం ఉమ్మడి జిల్లాలో 178 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. నియోజకవర్గాల వారీగా చూస్తే కోరుట్లలో 4, జగిత్యాలలో 20, ధర్మపురిలో 6, రామగుండంలో 25, మంథనిలో 19, పెద్దపల్లిలో 9, కరీంనగర్‌లో 44, చొప్పదండిలో 7, వేములవాడలో 30, సిరిసిల్లలో 7, మానకొండూర్‌లో 1, హుజూరాబాద్‌లో 6 మంది ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. వీరే కాకుండా చాలా మంది ఓటు హక్కు పొందని వారు కూడా ఉన్నారు. వీరిలో 18 ఏళ్లు నిండిన వారికి జాబ్‌కార్డు మంజూరు చేయనున్నారు.

గ్రామాల వారీగా గుర్తింపు: రవీందర్ రాథోడ్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి, పెద్దపల్లి

జిల్లాలోని గ్రామాల్లో ట్రాన్స్‌జెండర్లను గుర్తిస్తున్నారు. ప్రతి ఒక్కరికి జాబ్ కార్డు మంజూరు చేస్తాం. ప్రత్యేకంగా పని కల్పించి.. వసతులు సమకూర్చనున్నాం. వారిపై వివక్ష చూపకుండా మాములు కూలీలకు అవగాహన కల్పిస్తాం.

- న్యూస్‌టుడే, మల్లాపూర్

? ఎస్సారెస్పీ కాలువల్లో షట్టర్లను ఏర్పాటు చేయాలి. షట్టర్లు లేకపోవడంతో సాగునీరు వృథాగా పోతుంది. **-గడ్డం వీనేష్‌రెడ్డి, గొర్రెపల్లి**

✓ షట్టర్ల ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే పనులు చేపడతాం. **-రాకేష్, ఎస్సారెస్పీ ఏఈ**

– న్యూస్‌టుడే, జగిత్యాల వాణిజ్యం

? ఇరుకైన యావర్‌రోడ్డులో వాహనాల రద్దీ అధికమై ఇబ్బందులు తలెత్తుతున్నాయి. రోడ్డు వెడల్పునకు చర్యలు తీసుకోరా.? **- విజేందర్**

✓ పట్టణంలో ట్రాఫిక్ ఇబ్బందులు తీర్చేలా పోలీసులతో మాట్లాడి రోడ్డుపై ఉన్న వ్యాపారాలు, బోర్డులు తదితరాలను తొలగిస్తాము.
- సమ్మయ్య, పురపాలక కమిషనర్, జగిత్యాల

స్వచ్ఛ పట్టణ సాధనకు కృషి చేయాలి

కోరుట్ల, న్యూస్‌టుడే: కోరుట్ల పట్టణంలో స్వచ్ఛత సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పురపాలక సంఘ కమిషనర్ బట్టు తిరుపతి అన్నారు. మంగళవారం అయిలాపూర్‌రోడ్‌లో రోడ్డుకిరువైపులా పడేసిన చెత్తను యువకులు, పంచాయతీ సిబ్బంది సేకరించి శుభ్రం చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్, పర్యావరణ ఏఈ మహేష్, యువకులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి పట్టణం: స్వచ్ఛ మెట్‌పల్లిగా తీర్చేదిద్దేందుకు ప్రజలందరూ భాగస్వాములు కావాలని బల్దియా కమిషనర్ మోహన్ తెలిపారు. మంగళవారం పాత బల్దియా కార్యాలయ ఆవరణలో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. పారిశుద్ధ్య కార్మికులు పుర అధికారులు సిబ్బంది కలిసి స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేశారు. డీఈ నాగేశ్వర్‌రావు, హెల్త్ అసిస్టెంట్ ప్రవీణ్, విష్ణు, ముజీబ్, నిజాం, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

గోదావరి తీరంలో స్వచ్ఛతా కార్యక్రమం

ధర్మపురి, న్యూస్‌టుడే: ధర్మపురి గోదావరి తీరంలో మంగళవారం స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళిఘాట్ వద్ద మెట్లపై చెత్తచెదారాన్ని పుర కార్మికులు తొలగించారు. భక్తులు చెత్తను వేయడానికి ప్రత్యేకంగా కుండీలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పుర అధ్యక్షురాలు సంగి సత్తెమ్మ, ఉపాధ్యక్షుడు రామయ్య, కమిషనర్ గంగాధర్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ గంగాధర్, పర్యావరణ ఇంజినీర్ మహేష్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

కొడిమ్యాల, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్‌కుమార్ అన్నారు. యూనియన్ బ్యాంకు కొడిమ్యాల ఆధ్వర్యంలో స్థానిక తెలంగాణ ఆదర్శ పాఠశాలలో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా బ్యాంకు సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాఠశాల ఆవరణలోని పిచ్చిమొక్కలు తొలగించి, మానవహారం, స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. సంజీవ్‌కుమార్, ప్రిన్సిపల్ లావణ్య, సాగర్, మధుసూదన్, ముమ్మడి స్వామి, శంకర్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

అటవీశాఖ అధికారుల తీరుతో ఆందోళన

కోరుట్ల, న్యూస్‌టుడే: కథలాపూర్ మండలం ఇప్పపెల్లి గ్రామంలో అటవీ శాఖ అధికారుల తీరును నిరసిస్తూ మంగళవారం గ్రామస్థులు ఆందోళన చేపట్టారు. గ్రామశివారులోని అటవీ భూములలో మూడేళ్లుగా ఇతర గ్రామస్థులు చెట్లను తొలగించి చదును చేస్తే అటవీశాఖ అధికారులు పట్టించుకోలేదని, గ్రామ అవసరాల కోసం భూమిని చదును చేస్తే కేసులు పెట్టడమేమిటని మండిపడ్డారు. విషయం తెలిసిన వెంటనే కోరుట్ల, మేడిపల్లి ఎస్సైలు శ్రీకాంత్, శ్యాంరాజ్ సంఘటనా స్థలానికి చేరుకొని బందోబస్తు ఏర్పాటు చేశారు. మూడు గంటల పాటు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వరరావు, మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని గ్రామస్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అటవీ శాఖ అధికారులు, గ్రామస్థులతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తామని డీఎస్పీ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

పొగాకు నియంత్రణకేంద్రం ప్రారంభం

జగిత్యాల, న్యూస్‌టుడే: జగిత్యాల ప్రభుత్వ వైద్య కళాశాలలో మంగళవారం పొగాకు నియంత్రణ కేంద్రం ప్రారంభించారు. కేంద్ర కుటుంబసంక్షేమ శాఖ మంత్రి జె.పి.నడ్డా జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా అన్ని వైద్య కళాశాలల్లో వర్చువల్‌గా ప్రారంభించగా జగిత్యాల కళాశాలలో ప్రారంభ కార్యక్రమంలో జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాములు, మానసిక వైద్య విభాగ అధిపతి డాక్టర్ ఆకుల విశాల్ పాల్గొన్నారు.

ప్రభుత్వ విప్ పరామర్శ

ధర్మపురి, న్యూస్‌టుడే: ధర్మపురి మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు వేముల రాజేష్ ఇటీవల జరిగిన రహదారి ప్రమాదంలో గాయపడగా, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మంగళవారం ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. రాజేష్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మండల కాంగ్రెస్ నాయకులు దినేష్, రవీందర్ పాల్గొన్నారు.

పాఠశాలలకు నిధులు మంజూరు

జగిత్యాల, న్యూస్‌టుడే: జగిత్యాల నియోజకవర్గంలోని పలు పాఠశాలలకు ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి విజ్ఞప్తి మేరకు జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ నియోజకవర్గ ప్రత్యేక అభివృద్ధి నిధుల నుంచి రూ.80 లక్షలు మంజూరిచ్చారు. జగిత్యాల గాంధీనగర్, గుల్లపేట ఉన్నత పాఠశాలకు రూ.20 లక్షల చొప్పున, తాటిపల్లి తురకకాశీనగర్, సారంగాపూర్ మండలం అర్పపల్లి జడ్పీ పాఠశాల, రాయికల్ జడ్పీ పాఠశాల, జగిత్యాల విజయపురి ప్రాథమిక పాఠశాలల అభివృద్ధి పనులకు రూ.10 లక్షల చొప్పున మంజూరిచ్చారు.

జాతీయ సేవా పథకం దినోత్సవం


ట్రెక్కింగ్‌కు ఎంపికైన అనూషను అభినందిస్తున్న ప్రిన్సిపల్ అశోక్

జగిత్యాల పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక ఎస్‌కెఎన్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, రామకృష్ణ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. జాతీయస్థాయి ట్రెక్కింగ్ శిబిరానికి ఎంపికైన కళాశాల విద్యార్థిని అనూషను ప్రిన్సిపల్ అశోక్ అభినందించారు. ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఆడెపు శ్రీనివాస్, కె.శ్రీనివాస్, పి.రాజు, సాయిమధూకర్ పాల్గొన్నారు.

జగిత్యాల ధరూర్‌క్యాంపు: జాతీయ సేవాపథకంతో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు పెరిగి విద్యార్థుల సమగ్ర వ్యక్తిత్వ వికాసం సిద్ధిస్తుందని జాతీయ ఎన్.ఎస్.ఎస్ అవార్డు గ్రహీత డాక్టర్ ఎస్.మనోహరాచారి పేర్కొన్నారు. జగిత్యాలలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్.ఎస్.ఎస్ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె.రామకృష్ణ, జి.శ్రీలత, డి.సుజాత, చంద్రయ్య, వాసవి, ప్రమోద్‌కుమార్, రాంచందర్, నీరజ, జమున, సునీత తదితరులు పాల్గొన్నారు.


కోరుట్ల పశువైద్య కళాశాలలో అధ్యాపకులు, విద్యార్థులు

కొడిమ్యాల: విద్యార్థులు చదువుతో పాటు సేవా కార్యక్రమాల్లోనూ ముందుండాలని ఎస్సై సందీప్ అన్నారు. కొడిమ్యాల మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ సేవా పథకం దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించగా ఎస్సై ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ కె.వేణు, తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి: విద్యార్థులు చదువుతో పాటు సేవాభావాన్ని పెంపొందించుకోవాలని మెట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఆర్.వెంకటేశ్వరరావు అన్నారు. మెట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం జాతీయ సేవా పథకం దినోత్సవం నిర్వహించారు. అనంతరం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి గోవిందుల వెంకటేష్‌ను సన్మానించారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కోరుట్ల: కోరుట్ల పశువైద్య కళాశాల, ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలలో జాతీయ సేవా పథకం దినోత్సవం మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు, అధ్యాపకులు కళాశాల ఆవరణలో పెరిగిన పిచ్చిమొక్కలు, చెత్తను తొలగించారు. అనంతరం మొక్కలు నాటారు. అసోసియేట్ డీన్ డా.దాసరి శ్రీనివాస్, ప్రిన్సిపాల్‌లు సందీప్, గౌసూర్ రెహమాన్, ప్రోగ్రాం అధికారులు అంబిక, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

గొల్లపల్లి: విద్యార్థులు సేవాగుణం, క్రమశిక్షణ అలవర్చుకోవాలని గొల్లపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ రమేష్ పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం కళాశాలలో వేడుకలు నిర్వహించారు. కోఆర్డినేటర్ సంతోష్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పురుగు మందు తాగి యువకుడి ఆత్మహత్య

తల్లిపై దాడితో జగ్గాసాగర్‌లో ఉద్రిక్తత


ఏనుగు ప్రభాస్

మెట్‌పల్లి, న్యూస్‌టుడే: మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్‌కు చెందిన ఏనుగు ప్రభాస్(19) పురుగు మందు తాగి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. యువకుడి మృతికి తల్లి కారణమంటూ గ్రామానికి చెందిన మహిళలు దాడికి దిగడంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. తల్లి పేరు మీద ఉన్న ఇళ్లు, వ్యవసాయ భూమి యువకుడి తండ్రి పేరు మీద మార్చే వరకు అంత్యక్రియలు నిర్వహించేదీ లేదని స్థానికులు బైఠాయించారు. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. జగ్గాసాగర్‌కు చెందిన ఏనుగు ప్రతాప్ అదే గ్రామానికి చెందిన ఓ మహిళను వివాహం చేసుకొని ఇల్లరికం వెళ్లాడు. వారికి కుమారుడు ఏనుగు ప్రభాస్ ఉన్నారు. ప్రతాప్ కొంతకాలంగా గల్ఫ్‌కు వెళ్తున్నాడు. ప్రభాస్ ఇంటర్ పూర్తి చేసి హోటల్ మేనేజ్‌మెంట్ చేస్తానని తల్లిదండ్రులకు తెలపగా ఏదైనా ఉద్యోగం చేయాలని మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన ప్రభాస్ ఈ నెల 8న రాత్రి పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు మెట్‌పల్లిలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి అక్కడి నుంచి నిజామాబాద్‌కు తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న తండ్రి గల్ఫ్ నుంచి తిరిగొచ్చాడు. చికిత్స పొందుతూ ప్రభాస్ మంగళవారం మృతిచెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. ఈ నెల 22న నిజామాబాద్ ఆసుపత్రిలో ప్రభాస్ చికిత్స పొందుతున్న సమయంలో అక్కడి మేజిస్ట్రేట్ వాంగ్మూలం సేకరించారని, సంఘటనపై పూర్తి విచారణ జరుపుతామన్నారు. యువకుడి మృతికి తల్లి కారణమంటూ మహిళలు ఆగ్రహంతో ఆమెను చితకబాదారు. పోలీసులు వెంటనే ఆమెను తమ వాహనంలో కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. దీంతో గ్రామంలో ఒక్కసారిగా ఉద్రిక్తత చోటు చేసుకుంది. డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు, సీఐ నిరంజన్‌రెడ్డి గ్రామానికి చేరుకొని వారితో మాట్లాడారు. తల్లిని రప్పించిన తర్వాతే అంత్యక్రియలు నిర్వహిస్తామని కుల సంఘ సభ్యులు పట్టుబట్టారు. పోలీసులు సముదాయించినా ససేమిరా అన్నారు. తల్లి పేరు మీద ఇళ్లు, వ్యవసాయ భూములు ఉన్నాయని, వాటిని ప్రతాప్ పేరు మీద మార్చిన తర్వాతనే అంత్యక్రియలు నిర్వహిస్తామని చెప్పారు. బుధవారం మాట్లాడుకోవచ్చని పోలీసులు చెప్పగా, రిజిస్ట్రేషన్ పూర్తయిన తర్వాతనే అంత్యక్రియలు నిర్వహిస్తామని చెప్పి శీతల శవపేటిక తెప్పించి అందులో మృతదేహాన్ని ఉంచారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందుజాగ్రత్తగా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

నేర వార్తలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

మల్యాల, న్యూస్‌టుడే: నూకపల్లి శివారులోని మట్టినూతి సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మల్యాలకు చెందిన పత్తిపాక గంగాధర్ తీవ్రంగా గాయపడ్డారు. గంగాధర్ తన ద్విచక్రవాహనంపై జగిత్యాల నుంచి మల్యాలకు వస్తుండగా వెనుక నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. గంగాధర్‌ను 108 అంబులెన్సులో జగిత్యాల ఆసుపత్రికి తరలించినట్లు ఈఎంటీ జ్యోతి, పైలెట్ ఆంజనేయులు పేర్కొన్నారు. ప్రమాదానికి కారణమైన జగిత్యాల డిపోకు చెందిన బస్సును మల్యాల ఠాణాకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఆన్‌లైన్ మోసంపై కేసు

జగిత్యాల: జగిత్యాల పోచమ్మవాడలో ఓ మహిళ ఆన్‌లైన్‌లో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని నమ్మి మోసపోయింది. ఓ యాప్ ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని రూ.1.78 లక్షలు పెట్టుబడి పెట్టగా సోమవారం నుంచి యాప్ కనిపించడం లేదు. మోసపోయానని భావించి పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సీఐ ఎస్.వేణుగోపాల్ కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

గంజాయి విక్రేతల అరెస్టు

మల్యాల: మల్యాల మండలం ముత్యంపేట గ్రామ శివారులోని వరద కాలువ పక్కన గంజాయితో పట్టుబడిన ఇద్దరు వ్యక్తులను మంగళవారం సాయంత్రం అరెస్టు చేసినట్లు ఎస్సై నరేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్ రాష్ట్రంలోని అరారియా జిల్లా కుర్సుకట్టా తాలూకా షొయర్‌గాం గ్రామానికి చెందిన సంజుకుమార్‌సేన్ మల్యాల మండలం బల్వంతాపూర్ శివారులోని గోదాంలో హమాలీ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గంజాయి అలవాటున్న సంజుకుమార్‌సేన్‌కు పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని సౌత్24 పరనాస్ ప్రాంతంలోని మఖల్‌తాలా గ్రామానికి చెందిన చమద్‌అలీ మోండల్ పరిచయం అయ్యాడు. మల్యాల మండలంలోని చాలా మంది యువకులు గంజాయికి బానిసలుగా మారడంతో తన ప్రాంతంలోని గంజాయిని తీసుకొచ్చి విక్రయించడానికి సంజుకుమార్‌సేన్ నిర్ణయించుకున్నాడు. ఇందుకు చమద్‌అలీ మోండల్ కూడా ప్రోత్సహించి ముందస్తుగా రూ.1000 అందజేసి గంజాయి తీసుకురావాలని కోరాడు. సంజుకుమార్‌సేన్ ఇటీవలే తన స్వగ్రామానికి వెళ్లి పెళ్లి చేసుకున్నాడు. అనంతరం 105 గ్రాముల గంజాయితో తిరిగి బల్వంతాపూర్ గ్రామానికి చేరుకున్నాడు. మంగళవారం దానిని ఏ-1 నిందితుడైన సంజుకుమార్‌సేన్ ఏ-2 నిందితుడైన చమద్‌అలీమోండల్ ముత్యంపేట శివారులోని వరద కాలువ పక్కన పంచుకుంటుండగా సిబ్బందితో కలిసి నిందితులిద్దరిని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

అప్రమత్తంగా ఉన్నప్పుడే చీడపీడల నుంచి రక్షణ


సారంగాపూర్: పంటలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి వాణి, రైతులు

సారంగాపూర్, న్యూస్‌టుడే: రైతులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి, ముందస్తు చర్యలు చేపట్టినప్పుడే పంటలపై చీడపీడల ఉద్ధృతి నుంచి రక్షించుకోవచ్చని జిల్లా వ్యవసాయాధికారి బి.వాణి పేర్కొన్నారు. మంగళవారం సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లోని వరి, పత్తి, కంది పంటలను పరిశీలించారు. అనంతరం పలు ఎరువుల దుకాణాలు, రైతు వేదికల్లో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సు అవగాహన సదస్సులలో పాల్గొన్నారు. మాజీ ఎంపీపీ మాసర్థి రమేష్, వ్యవసాయాధికారి తిరుపతినాయక్, విస్తరణాధికారులు వెంకటేశ్, ఆంజనేయులు, వినోద్, శిరీష, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

కొడిమ్యాల: వరిలో తెగులు నివారణకు రైతులు తగు జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయాధికారి పర్లపెల్లి జ్యోతి అన్నారు. కొడిమ్యాల మండలం పూడూర్ గ్రామశివారులోని వరి పంట పొలాలను రైతులతో కలిసి జ్యోతి పరిశీలించారు. ఏఈవోలు గ్రీష్మ, మంజుల, రాజేష్, మాజీ సర్పంచి రాంరెడ్డి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాల వ్యవసాయం: జగిత్యాల అర్బన్ మండలం లింగంపేటలో రైతులు సాగుచేస్తున్న వరిపైరును ఏవో వినీల, ఏఈవో నాగరాజు మంగళవారం పరిశీలించారు. అగ్గితెగులు, ఎండుతెగులు నివారణ చర్యలను రైతులకు వివరించారు. రైతులు కిషన్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

మల్యాల: పొట్ట దశలో ఉన్న వరి పంటకు సోకే తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మల్యాల మండల వ్యవసాయ అధికారి చంద్రదీపక్ రైతులకు అవగాహన కల్పించారు. మంగళవారం మల్యాలలోని పలువురు రైతులకు చెందిన వరిపొలాలను పరిశీలించారు. ఏఈవోలు మంజుల, కె.శ్రీనివాస్, కారుణ్యకుమార్, ఈ.శ్రీనివాస్, పాల్గొన్నారు.

ప్రత్యేకాధికారులు గ్రామాల్లో అందుబాటులో ఉండాలి


మల్లాపూర్ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే సంజయ్

మల్లాపూర్, న్యూస్‌టుడే: గ్రామాల్లో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించడంలో ప్రత్యేకాధికారులు విఫలమవుతున్నారని, ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ముందుకు సాగాలని ఎమ్మెల్యే సంజయ్ సూచించారు. మల్లాపూర్ మండల పరిషత్తు కార్యాలయంలో మంగళవారం జరిగిన సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు అనుకున్న స్థాయిలో జరుగడంలేదన్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు తీవ్ర, విష జ్వరాలతో రోగులు మంచం పడుతున్నారన్నారు. ఎంపీడీవో జగదీష్, తహసీల్దార్ వీర్‌సింగ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు

కోరుట్ల: కోరుట్ల పట్టణం అల్లమయ్యగుట్ట వద్దనున్న శ్రీఅభయాంజనేయ స్వామి దేవాలయ అభివృద్ధికి రూ.10 లక్షలను మంజూరు చేస్తు ఎమ్మెల్యే డా.కల్వకుంట్ల సంజయ్ మంగళవారం ఆలయ కమిటీ సభ్యులకు ధ్రువపత్రం అందజేశారు. పద్మశాలి కులోన్నతి సంఘం నూతన కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్యేను కలిసి సన్మానించారు. కౌన్సిలర్ సత్యం, బట్టు సునీల్, ఆనంద్, నగేష్, ఫయ్యూం, బాబా, మురళి, ఆతీక్ తదితరులు పాల్గొన్నారు.

రైతు పక్షపాతి ప్రభుత్వం


లబ్ధిదారులకు చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

సారంగాపూర్, న్యూస్‌టుడే: రైతులకు అన్ని విధాలా అండగా ఉండేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం సారంగాపూర్‌లో కల్యాణలక్ష్మి, సీఎం సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ త్వరలోనే రేషన్ కార్డుల జారీ ప్రక్రియ ప్రారంభం కానుందని, ప్రజా సంక్షేమానికి ప్రభుత్వంతో కలిసి నియోజకవర్గ అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని పేర్కొన్నారు. అనంతరం మండలంలోని రేచపల్లిలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు మేడిపల్లి మనోహర్‌రెడ్డి తండ్రి రాజమల్లారెడ్డి సంతాప సభలో పాల్గొన్నారు. తహసీల్దార్ వరందన్, ఎంపీడీవో గంగాధర్, మాజీ ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం

జగిత్యాల పట్టణం: చాకలి ఐలమ్మ పోరాటం నేటి తరం మహిళలకు స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. హైదరాబాద్ కోఠిలోని మహిళా విశ్వవిద్యాలయానికి చాకలి ఐలమ్మ పేరు ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి స్థానిక చింతకుంట వద్ద ఛైర్‌పర్సన్ అడువాల జ్యోతితో కలిసి మంగళవారం క్షీరాభిషేకం చేశారు. వైస్‌ఛైర్మన్ గోలి శ్రీనివాస్, బాలె శంకర్, పంబాల కుమార్ పాల్గొన్నారు.

సురక్షితమైన తాగునీరందించాలి

మెట్‌పల్లి, న్యూస్‌టుడే: ప్రజలకు సురక్షితమైన తాగునీరందించేలా కృషి చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ అధికారులు పేర్కొన్నారు. మెట్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఇబ్రహీంపట్నం, మెట్‌పల్లి మండలాల గ్రామ మంచినీటి సహాయకులకు చేతిపంపులు, బోర్‌వెల్స్, మోటారు పంపుసెట్లు, పైపులైన్ లీకేజీలు, సురక్షితమైన తాగునీటి సరఫరాపై నాలుగు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. అనంతరం క్షేత్రస్థాయిలో చేతిపంపుల మరమ్మతులపై శిక్షణ ఇచ్చారు. డీఈలు ప్రేమ్‌కుమార్, ఆనంద్, ఎంపీడీవోలు రామకృష్ణ, చంద్రశేఖర్, ఏఈలు పాల్గొన్నారు.

రుణమాఫీ చేయాలని రైతుల నిరసన

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: ప్రభుత్వం రైతు రుణమాఫీని పూర్తిగా అమలు చేయాలని, రైతుబంధు నిధులను వెంటనే ఖాతాల్లో జమ చేయాలని కోరుతూ పలువురు రైతులు ఇబ్రహీంపట్నం రైతు వేదికకు మంగళవారం తాళం వేసి నిరసన తెలిపారు. గత నెల 15 వరకే రూ.2 లక్షల వరకు రుణాలు మాఫీ చేస్తానని హామీ ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి మాట తప్పారని, ఇచ్చిన హామీ ప్రకారం ప్రతి రైతుకు రుణమాఫీ చేయాలని, రైతుబంధు నిధులను జమ చేయాలని లేకుంటే రైతుల ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు. ఏలేటి చిన్నారెడ్డి, నాంపల్లి రమేష్, కల్లెంచిన్న సాయన్న, తీగల రవీంద్‌రెడ్డి, బాస జలంధర్, బద్దం సత్యరెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

కోరుట్ల, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వేములవాడ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వికాస్‌రావు పేర్కొన్నారు. మంగళవారం కథలాపూర్ మండలంలోని గంబీర్‌పూర్, తాండ్ర్యాల, పోతారం గ్రామాల్లో భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమాలు చేపట్టారు. గోపాల్‌రెడ్డి, సత్యనారాయణ, వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక

బీమారం, న్యూస్‌టుడే: బీమారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 17 మంది విద్యార్థులు జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. జగిత్యాలలో జరిగే పోటీల్లో పాల్గొంటారని ప్రధానోపాధ్యాయుడు జవ్వాజి అశోక్, పీఈటీ పెసరి తిరుమలేశ్ తెలిపారు. విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు, అరుణ, అర్జున్, లావణ్య అభినందించారు.

అక్టోబరు 4న చలో కలెక్టరేట్


సమావేశమైన జిల్లా రైతు ఐక్యవేదిక నాయకులు

మేడిపల్లి: ప్రభుత్వం రూ.2 లక్షల రుణమాఫీ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అక్టోబరు 4న చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా రైతు ఐక్యవేదిక నాయకులు పేర్కొన్నారు. మంగళవారం మేడిపల్లిలో జిల్లాలోని అన్ని మండలాలకు చెందిన రైతు ఐక్యవేదిక నాయకులు సమావేశం నిర్వహించారు. అధ్యక్షుడు నల్ల రమేశ్ రెడ్డి, పన్నాల తిరుపతి రెడ్డి, కాటిపల్లి ఆదిరెడ్డి, బందెల మల్లన్న, కొడిపెల్లి గోపాల్ రెడ్డి, పిడుగు సందన్న తదితరులున్నారు.

పొలం బాటతో విద్యుత్తు సమస్యల పరిష్కారం

కోరుట్ల: పొలం బాటలో వ్యవసాయ విద్యుత్తు సమస్యలు పరిష్కరించనున్నట్లు ఏడీ ఆంజన్‌రావు అన్నారు. మంగళవారం కోరుట్ల మున్సిపల్ పరిధిలోని ఏఖీన్‌పూర్ గ్రామంలో వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించారు. విద్యుత్తు లోడ్ ఎక్కువగా ఉన్న నియంత్రికలను గుర్తించినట్లు తెలిపారు. విద్యుత్తు స్తంభాలు, తక్కువ ఎత్తులో ఉన్న తీగలను సరి చేస్తామని పేర్కొన్నారు.

317 జీవో బాధితులకు న్యాయం చేయాలి

కోరుట్ల: 317 జీవో కారణంగా నిర్బంధంగా ఇతర ప్రాంతాలకు బదిలీ అయిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బోనగిరి దేవయ్య, బోయినిపెల్లి ప్రసాద్‌రావు అన్నారు. మంగళవారం కథలాపూర్ మండలంలో సభ్యత్వ నమోదు చేయించారు.

టీపీటీఎఫ్ సభ్యత్వ నమోదు

కోరుట్ల: కథలాపూర్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఉపాధ్యాయులతో సభ్యత్వ నమోదు కార్యక్రమం మంగళవారం చేపట్టారు. కిషన్‌రావు, రాంచందర్, రాజయ్య, రాజశేఖర్, శ్రీనివాసస్వామి పాల్గొన్నారు.

గురుకులాల సమస్యల పరిష్కారానికి వినతి

మెట్‌పల్లి: గురుకుల పాఠశాలల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మెట్‌పల్లిలో ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్‌కు టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. 28న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే మహాధర్నాకు హాజరై విజయవంతం చేయాలని కోరారు. శ్యామ్‌సుందర్, చిన్నఅంజయ్య, శ్రీనివాస్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

సంక్షిప్తం

అభివృద్ధిపై దృష్టిసారించాలి

మెట్‌పల్లి: మెట్‌పల్లి మహిళా ఉత్పత్తిదారుల కంపెనీ అభివృద్ధిపై దృష్టిసారించాలని సెర్ప్ అదనపు పీడీ చరణ్‌దాస్ పేర్కొన్నారు. మెట్‌పల్లి ఐకేపీ కార్యాలయంలో మంగళవారం మహిళా ఉత్పత్తిదారుల కంపెనీ సభ్యులతో సమావేశమయ్యారు. కంపెనీ ద్వారా ఏడాదిలో చేపట్టిన పనులను వివరించారు.

స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి సాధించాలి

కోరుట్ల: మహిళా సంఘాల మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి సాధించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి ప్రాజెక్టు సంచాలకులు రఘువరన్ అన్నారు. మంగళవారం కోరుట్ల ఉజ్వల మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళా క్యాంటీన్‌ను ప్రారంభించారు.

కోరుట్ల: అయిలాపూర్ మేజర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో గ్రామపంచాయతీ ఎన్నికల దృష్ట్యా పోలింగ్ బూత్‌లను జిల్లా పంచాయతీ అధికారి రఘువరన్ పరిశీలించారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు.

విద్యార్థుల ప్రగతి పరిశీలన

రాయికల్: మండలంలోని వీరాపూర్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థుల ప్రగతి పరిశీలన జరిగింది. సెక్టోరియల్ అధికారి కొక్కుల రాజేష్ విద్యార్థుల పత్రాలను పరిశీలించారు. ఏన్.ఏ.ఎస్. పరీక్షకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని సూచించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం కేటాయించండి

రాయికల్: మండలంలోని అల్లీపూర్ గ్రామంలోని అల్లీపూర్ రైతు మిత్ర ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్‌కు గ్రామంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కేటాయించాలని మంగళవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు.

జగిత్యాల: ఖరీఫ్ ధాన్యం కొనుగోలు కేంద్రం ఇవ్వాలని మంగళవారం రాయికల్ మండలం అల్లీపూర్ రైతు మిత్ర ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ సభ్యులు జీవన్‌రెడ్డిని కలిసి కోరారు. స్పందించిన ఎమ్మెల్సీ వెంటనే జిల్లా కలెక్టర్‌తో మాట్లాడారు.

నైపుణ్య శిక్షణపై అవగాహన సదస్సు

జగిత్యాల పట్టణం: స్థానిక కేజీఆర్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో విద్యార్థులకు నైపుణ్య శిక్షణపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. దివాస్‌గుప్తా విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.

నాలుగు దుకాణాలకు జరిమానా

జగిత్యాల పట్టణం: జగిత్యాల పట్టణంలో పురపాలక సిబ్బంది ఆహార నాణ్యతపై పలు దుకాణాలను మంగళవారం తనిఖీ చేశారు. నాణ్యత పాటించాలని నాలుగు దుకాణాలకు రూ.6 వేల జరిమానా విధించారు.

వృద్ధాప్య పింఛన్ నిలిపేశారని ఫిర్యాదు

మల్యాల: మల్యాల మండలంలో వృద్ధాప్య పింఛన్ నిలిపివేయడంతో బాధితులు మండల పరిషత్ అధికారులకు ఫిర్యాదు చేశారు. రామన్నపేటకు చెందిన ఓ వృద్ధుడికి ప్రతినెలా పింఛను అందుతుండగా గత నెల నుంచి చనిపోయినట్లు పేర్కొంటూ పింఛన్ నిలిపివేయడంతో అధికారులకు ఫిర్యాదు చేశారు. బ్యాంకు ఖాతాల నిర్వహణ సరిగా లేకపోవడం వంటి కారణాలు పేర్కొంటూ నిలిపివేసి ఉండవచ్చని, సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు మండల పరిషత్ సూపరింటెండెంటు, సిబ్బంది వివరించారు.

28న జాతీయ లోక్ అదాలత్

మెట్‌పల్లి: మెట్‌పల్లి కోర్టులో 28న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జూనియర్ సివిల్ జడ్జి అరుణ్‌కుమార్ అన్నారు. మంగళవారం కోర్టులో పోలీస్ అధికారులు, న్యాయవాదులతో సమన్వయ సమావేశం నిర్వహించారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

మల్యాల: అడ్డరోడ్డు సమీపంలోని పెట్రోలు బంకు ఆవరణలో మంగళవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్ ప్రభాకర్ నేతృత్వంలో ఉచిత నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. కొత్త సురేష్, సునీల్, మహేందర్, కార్యదర్శి గద్దె నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయి కళోత్సవ్ పోటీలు

రాయికల్ పట్టణం: 2024-25 సంవత్సరం రాయికల్ మండల స్థాయి కళోత్సవ్ పోటీలను పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. నృత్యం, చిత్రలేఖనం, కాగితాలతో బొమ్మల తయారీ, వంటి పోటీలు నిర్వహించారు. ఎంపికైన విద్యార్థులు ఈనెల 26న జగిత్యాలలోని టీచర్స్ భవన్‌లో హాజరుకావాలన్నారు. సతీష్, శ్రీపతి రాఘవులు, పొన్నం రమేష్, కన్నవేని మల్లారెడ్డి, మహేశ్వరశర్మ పాల్గొన్నారు.

కార్యకర్తలే పార్టీకి బలం

బీమారం: కార్యకర్తలే పార్టీకి బలమని భారాస వేములవాడ నియోజకవర్గ ఇన్‌ఛార్జి చలిమెడ లక్ష్మీనర్సింహారావు అన్నారు. మంగళవారం బీమారం మండలం మన్నెగూడెంలో భారాస నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు.

హిందూ సంఘాల ఆధ్వర్యంలో నిరసన


నిరసన తెలుపుతున్న హిందూ సంఘ సభ్యులు

కొడిమ్యాల: తిరుమల లడ్డూ ప్రసాదాన్ని కల్తీ చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలోని అంగడిబజార్ ప్రాంతంలో హిందూ సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. సంఘాల సభ్యులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.